సాక్షి
ఖమ్మం
బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



భయం భయంగానే అన్నదాత

అకాల వర్షాల భయం అన్నదాతను వీడడం లేదు. తడిసిన ధాన్యంతో పాటు పంటలను కాపాడుకునేందుకు జాగారం చేస్తున్నారు. 8లో



గమ్యం చేరని జీవితాలు

మిర్చి ఏరేందుకు కల్లూరు నుంచి వెళ్తున్న కూలీల ఆటోను ఏన్కూరు వద్ద కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం కూడా పెద్దగా కనిపించదు.

న్యూస్‌రీల్

రేపు దివ్యాంగులకు జాబ్ మేళా



ఖమ్మం స్పోర్ట్స్: దివ్యాంగ నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు 'యాత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్' ఆధ్వర్యాన ఈనెల 27న జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో జరిగే ఈ మేళాలో 65మందిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన వారు సర్టిఫికెట్లు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటోలతో ఉదయం 10.30గంటలకు మొదలయ్యే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.

మే 31వరకు కళాశాలలకు సెలవులు



ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డు వచ్చే నెల 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు వెల్లడించారు. ఈ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, బోర్డు ప్రకటించాకే ప్రవేశాలు కల్పించాలని సూచించారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు



ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరిధిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఖమ్మంలోని పది కేంద్రాల్లో మంగళవారం పరీక్షలు నిర్వహించగా ఉదయం పదో తరగతి పరీక్షకు 671మందికి గాను 589మంది, మధ్యాహ్నం పరీక్షకు ఇద్దరికి ఇద్దరు హాజరయ్యారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షకు ఉదయం 999మందిలో 834మంది, మధ్యాహ్నం పరీక్షకు 17మందిలో 15మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు.

సమ్మర్ క్యాంప్ వేదికలు ఖరారు



ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన ఈ ఏడాది జిల్లాలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల వేదికలను అధికారులు ఖరారు చేశారు. ఈమేరకు జిల్లాలో పది క్యాంప్‌లు, నగరంలో 25 శిబిరాలను ఏర్పాటుచేయనున్నట్లు డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి తెలిపారు. ఇప్పటికే శిబిరాలకు క్రీడా సామాగ్రి చేరవేయడంపై దృష్టి సారించామని వెల్లడించారు.

సహాయ ఉపకరణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంగాంధీచౌక్: దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి తెలిపారు. శారీరక, మానసిక దివ్యాంగులు, బధిరులు, అంధులు ఉపకరణాల కోసం వచ్చేనెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈమేరకు https:// tsobmms.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాక, దరఖాస్తు పత్రం, ధృవీకరణ పత్రాలను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది..



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ శేషగిరిరావు

తల్లాడ: రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు వెల్లడించారు. తల్లాడ మండలం నూతనకల్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారుల కారణంగా రైతులు నష్టపోవద్దనే భావనతో గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ తూము వీరభద్రరావు, సర్పంచ్ తూము శ్రీనివాసరావుతో పాటు నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు, కళ్యాణపు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆగొద్దు..

- వలస పక్షులకు ఎన్నికల సమయంలో బుద్ధి చెప్పాలి
- ధంసలాపురం బ్రిడ్జి తెస్తానన్న వారి హామీ ఏమైంది?
- తొమ్మిదేళ్లలో ఒక్క ఆరోపణ లేకుండా ప్రజలకు సేవ చేశా..
- బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు



బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ నామ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో ఖమ్మం సమగ్రాభివృద్ధి సాధించింది.. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చేయడంతో పాటు ఇక్కడ బీఆర్‌ఎస్‌ను గెలిపించడం ద్వారా ఖమ్మం అభివృద్ధి ఆగిపోకుండా చూసుకోవాలి. అభివృద్ధి ఆగదనే నమ్మకం నాకు ఉంది. వలస పక్షులకు రానున్న ఎన్నికల సమయాన మళ్లీ బుద్ధి చెప్పాలి... అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం మమత కళాశాల గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ఖమ్మం నియోజకవర్గ ప్రతినిధుల సభకు పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షత వహించారు. ఈసభలో మంత్రి పువ్వాడ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత కూడా ఖమ్మం నియోజకవర్గంలో మరింత బలోపేతమైందని చెప్పారు.

రూ.7 కోట్ల కుంభకోణం చేశారు..

కేంద్ర మంత్రిగా పనిచేసిన రేణుకా చౌదరి ఖమ్మానికి చెప్పుకోతగ్గ ఒక్క పనైనా చేశారా అని మంత్రి ప్రశ్నించారు. కానీ తాను చేసింది చెప్పాలంటే చాంతాడంత ఉందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. కానీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న వారు ఒక్క ఇర్రేడియేషన్ ప్లాంట్ తెస్తున్నట్లు చెప్పి రూ.7 కోట్ల కుంభకోణం చేసినా ప్లాంట్ మాత్రం రాలేదన్నారు. ఇక ధంసలాపురం పై ఓవర్ బ్రిడ్జి మంజూరైందని చెప్పిన నేత.. ఖమ్మానికి గుండుసున్నా చుట్టారన్నారు. ప్రస్తుతం అదే ధంసలాపురం పై ఓవర్ బ్రిడ్జిని సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.77 కోట్లతో పూర్తిచేశామని తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరికి దమ్ముంటే ఖమ్మంలో తనపై పోటీ చేసి గెలవాలని సూచించారు. ఇక జైలుకు వెళ్లివచ్చిన రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చి షో చేస్తే ప్రజలు నమ్మరని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ దార్శనికతతో రహదారుల అభివృద్ధి

కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు జాతీయ రహదారుల విషయంలో కాంగ్రెస్ నేతలు ఏం చేయలేక పోయారని పువ్వాడ ఎద్దేవా చేశారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో సూర్యాపేట – ఖమ్మం, కోదాడ – ఖమ్మం రహదారులు పూర్తికాగా, ఖమ్మం – దేవరపల్లి, ఖమ్మం – కురవి హైవేలు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. ఇది కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమని తెలిపారు. అభివృద్ధి కోసం తన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఖమ్మంకు నాలుగేళ్లలో రూ.1,200 కోట్ల నిధులు ఇచ్చారని చెప్పారు. తన తల్లి ఇక్కడే కని, చదివించి ఇక్కడే ఏదో చేయాలని చెప్పడంతో మెడికల్ కాలేజీ పెట్టడమే కాక పేదలకు సేవ చేస్తున్నానని, తన తండ్రి తర్వాత ఖమ్మంలోనూ ఉంటూ సేవ చేస్తున్నానని వెల్లడించారు.

కేసీఆర్ ప్రధాని కావడం ఖాయం..

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని, కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని ఔరంగాబాద్ సభే ఇందుకు నిదర్శనమని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రికి బహుమతిగా ఇచ్చేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. తొలుత ఎంపీ నామ నాగేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరాక, ఎనిమిది తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. ఇంకా ఈ సభలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, నాయకులు, ప్రజాప్రతినిధులు ఫాతిమా జోహరా, గుండాల కృష్ణ, నల్లమల వెంకటేశ్వరరావు, కమర్తపు మురళి, కర్నాటి కృష్ణ, తోట రామారావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బొమ్మా రాజేశ్వరరావు, చెరుకూరి కృష్ణమూర్తి, మేకల సుగుణారావు, తాజుద్దీన్, పులిపాటి ప్రసాద్, చిన్ని కృష్ణారావు, బిచ్చాల తిరుమలరావు, పాల్వంచ కృష్ణ, కుర్రా భాస్కర్, వీరూనాయక్, బత్తుల మురళి పాల్గొన్నారు.

జిల్లావాసులకు మెరుగైన వైద్యం

మెడికల్ కళాశాల పనులు పరిశీలించిన డీఎంఈ రమేష్‌రెడ్డి



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న డీఎంఈ రమేష్‌రెడ్డి

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం బోధన ప్రారంభం కానుండటంతో జిల్లాలో వైద్యసేవలు మెరుగుపడనున్నాయని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. పాత కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించి టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావుకు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రి హెచ్‌ఓడీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎంఈ మాట్లాడుతూ కళాశాలకు అనుసంధానంగా ఉండే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే అన్నిరకాల విభాగాలు ప్రారంభమైనందున అత్యాధునిక పరికరాలు కూడా వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సాధ్యం కాని వైద్యసేవలను హైదరాబాద్, వరంగల్‌కు రిఫర్ చేస్తున్నారని,ఇక నుంచి అలా జరగొద్దని సూచించారు. అలాగే, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందిని కొనసాగిస్తామని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రాజేశ్వరరావు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓలు బి.శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్, గైనిక్ హెచ్‌ఓడీ కృపా ఉషశ్రీ, డాక్టర్ రామునాయక్, ఉద్యోగులు రాజశేఖర్‌గౌడ్, సాగర్, నందగిరి శ్రీనివాస్, మేరీ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టులను పరిశీలించిన కలెక్టర్



కోర్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సిద్ధమైన మూడు లాన్ టెన్నిస్ కోర్టులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం పరిశీలించారు. సుమారు రూ.93లక్షలతో ఈ కోర్టులు సిద్ధం కాగా.. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ కోర్టులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, పీఆర్ ఈఈ కేవీకే.శ్రీనివాస్, ఏఈ అదిత్యరాజ్, టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టండి

ఖమ్మం సహకారనగర్: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా తక్షణమే ప్రారంభించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ – తెలంగాణ(ఎస్‌టీఎఫ్ టీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో అర్హులైన ఉపాధ్యాయులు ఒకే కేడర్‌లో కొనసాగుతున్నారని తెలిపారు. అర్హత ఉండి కూడా ఎదురుచూడాల్సి రావడం బాధగా ఉందని చెప్పారు. ఇక బదిలీల విషయంలో అదే పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా ప్రక్రియ ప్రారంభించడంతో పాటు పీఆర్‌సీ, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, మన్సూర్‌తో పాటు మహబూబ్ అలీ, వెంకన్న, రామకృష్ణంరాజు, సుధాకర్‌రెడ్డి, సురేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

సీఈఐఆర్‌పై విస్తృత ప్రచారం

- నేరాల నియంత్రణకు ముమ్మరంగా పెట్రోలింగ్
- నేర సమీక్షలో సీపీ విష్ణు ఎస్.వారియర్



వీసీలో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే ట్రాక్ చేయడానికి సహాయపడే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. కమిషనరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రారంభమైన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటే ఇబ్బందులు ఉండవని చెప్పారు. కాగా, రానున్న వ్యవసాయ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మార్కెట్‌లోకి రాకుండా ఇప్పటి నుంచే శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే, ఈ నెల 30న 21 కేంద్రాల్లో కానిస్టేబుల్ అభ్యర్థుల తుది రాత పరీక్ష జరగనున్నందున ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. కాగా, దేశంలో అత్యుత్తమమైన పోలీస్ స్టేషన్ల జాబితాలో స్థానం సాధించిన మధిర రూరల్, వీఎం బంజర పోలీస్‌స్టేషన్ల పనితీరును ఆదర్శంగా తీసుకొని మిగతా ముందుకెళ్లాలని చెప్పారు. ఇక నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌తో పాటు పెట్రోలింగ్ మరింత విస్తృతం చేయాలని సీపీ వారియర్ ఆదేశించారు.

హైవేకు అనుసంధానంగా హెలీప్యాడ్!



టోల్‌ప్లాజా వద్ద నిర్మించిన హెలీప్యాడ్

జాతీయ రహదారుల నిర్మాణంలో కాలానుగుణంగా మార్పులు వస్తున్నాయి. సూర్యాపేట – ఖమ్మం జాతీయ రహదారిని గతంతో పోలిస్తే ఆధునిక పరిజ్ఞానం, అన్ని హంగులతో నిర్మించగా ఇటీవలే రాకపోకలు మొదలయ్యాయి. తాజాగా రహదారికి అనుసంధానంగా హెలీప్యాడ్ కూడా నిర్మించారు. జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం సమీపాన సింగరేణిపల్లి టోల్‌ప్లాజా వద్ద హెలీప్యాడ్ నిర్మాణం పూర్తయింది. ప్రముఖులు హెలీకాప్టర్‌లో వస్తే ఇక్కడ ల్యాండ్ అయి జాతీయ రహదారి మీదుగా సమీప ప్రాంతాలకు వెళ్లేలా నిర్మించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

– కూసుమంచి

పంట నష్టంపై సమగ్ర సర్వే

- రంగంలోకి నాలుగు బృందాలు
- 9,881 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా
- ఈనెల 29వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదిక



ఖమ్మం రూరల్ : గోళ్లపాడులో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర



రఘునాథపాలెం : బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి సందీప్

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి వైపరీత్యాలపై సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా పలు సూచనలు చేశారు. దీంతో కలెక్టర్ గౌతమ్ జిల్లాలో పంట నష్టంపై సర్వే చేసి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గతనెల 21వ తేదీ తర్వాత గాలిదుమారం, వడగండ్ల వానతో జిల్లాలో 7,401 మంది రైతులకు చెందిన 9,881 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర సర్వే చేసేందుకు ఉన్నతాధికారులతో కూడిన నాలుగు బృందాలను ఏర్పాటుచేశారు. ఆయా బృందాలు మంగళవారం సర్వే మొదలుపెట్టగా ఈనెల 28వ తేదీలోగా అంచనాలు రూపొందించి 29వ తేదీన నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. గతనెల అకాల వర్షాలతో 18,258 మంది రైతులకు 23,632.17 ఎకరాల్లో పంట నష్టం జరగగా ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం మంజూరు చేసింది. ఆ పరిహారం రైతులకు చేరకముందే మరోమారు ప్రకృతి పంటలను దెబ్బతీసింది. కాగా, వ్యవసాయ శాఖ పరిధిలో వరి, మొక్కజొన్న తదితర పంటలకే కాక ఉద్యాన శాఖ పరిధిలోని మామిడి, సపోట, పుచ్చకాయ పంటలకు కూడా నష్టం వాటిల్లింది. మధిర, వైరా, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో 376 మంది రైతులకు చెందిన 1,316 ఎరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు శాఖ ప్రాథమికంగా గుర్తించినా, సమగ్ర సర్వేకు ఆదేశాలు అందాల్సి ఉంది.

సర్వే మొదలుపెట్టిన అధికారులు

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: ప్రభుత్వ ఆదేశాలతో పంట నష్టాన్ని గుర్తించేందుకు అధికారులు సర్వే మొదలుపెట్టారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు, తెల్దారుపల్లిల్లో కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏఓ వి.నాగేశ్వరరావు, రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, శివాయిగూడెం, రాంక్యాతండా, బావోజీతండా, సుకినీ తండా, వాంకడోతు తండా, వెంకటాయపాలెంల్లో ఉద్యానశాఖ ఖమ్మం డివిజన్ అధికారి గుడిమళ్ల సందీప్ పర్యటించారు. ఈ సందర్భంగా నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పడిపోయిన మొక్కజొన్న పంటను పైకి లేపాలని, కోతకు వచ్చిన వరిని వెంటనే కోయాలని రైతులకు సూచించారు.

నెలాఖరు వరకే 'ఎర్లీ బర్డ్' పథకం



సమీక్షలో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్, మున్సిపాలిటీల ప్రజలు ఈనెలలో ఆస్తిపన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ లభిస్తుందని.. ఎర్లీ బర్డ్‌గా ప్రవేశపెట్టిన ఈ పథకం నెలాఖరు వరకే అందుబాటులో ఉంటుందని ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన పన్ను వసూళ్లపై సమీక్షించారు. నగరంలో రూ.30.87 కోట్ల ఆస్తి పన్నుకు గాను రూ.10కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా, రూ.5.76 కోట్లు వసూలయ్యాయని తెలిపారు. ప్రజలు పెద్దసంఖ్యలో పన్ను చెల్లించేలా అవగాహన కల్పించాలని, ఇందుకోసం నియమించిన బృందాలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. కాగా, జిల్లాలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా వారం పాటు కార్పొరేషన్ విధులపై అధ్యయనం చేయనున్నారు. ఈమేరకు మంగళవారం ఆమె కార్పొరేషన్‌కు రాగా కమిషనర్ పలు అంశాలను వివరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్‌ఓ జి.శ్రీనివాస్, ఈఈ కృష్ణాలాల్, డీఈలు నవ్యజ్యోతి, ధరణికుమార్, రంగారావు, ఆర్‌ఐలు లోకేష్‌కుమార్, కె.శ్రీనివాస్, మేనేజర్ విజయానంద్ పాల్గొన్నారు. తొలుత పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు.

శాస్త్రోక్తంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం రామాలయంలో శ్రీ సీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణం మంగళవారం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

అటు సమ్మె.. ఇటు విధులు



ఖమ్మం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టిజన్లు

- సమ్మెలో కొద్దిమంది ఆర్టిజన్లు
- మిగతా వారు యథావిధిగా విధులకు..
- ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారుల పర్యవేక్షణ



ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయం వద్ద పోలీస్ పహారా

ఖమ్మంవ్యవసాయం: సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టిజన్లు మంగళవారం నుంచి సమ్మెబాట పట్టారు. అయితే, సమ్మెలో కొందరు మాత్రం పాల్గొనగా.. విద్యుత్ పంపిణీ, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్టిజన్లకు స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేస్తూ ఎక్సిస్టింగ్ (ఏపీఎస్‌ఈబీ) సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, విద్యార్హతల ఆధారంగా కన్వెర్షన్ ఇవ్వడంతో పాటు పీఆర్సీ అమలు, అన్‌మెన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలనే తదితర డిమాండ్లతో మంగళవారం నుంచి వారు సమ్మెబాట పట్టారు. అయితే హెచ్–82 యూనియన్ కార్మికులు సమ్మెలో పాల్గొంటుండగా, మిగతా యూనియన్ల కార్మికులు యథావిధిగా విధులకు హాజరయ్యారు.

ఎక్కువ మంది విధులకు హాజరు

ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్‌లో ఆర్టిజన్ల సమ్మె నామమాత్రంగానే సాగింది. సర్కిల్‌లో ఆర్టిజన్లు 267 మంది పనిచేస్తుండగా, 249 మంది విధులకు హాజరయ్యారు. మిగతా 18 మంది విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. ఆయా ఆర్టిజన్ల స్థానంలో ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. అంతేకాకుండా ప్రతీ సబ్ స్టేషన్‌కు నోడల్ అధికారిని నియమించగా.. సమ్మెతో ఇబ్బందులు తలెత్తకుండా కార్యాలయాలు, సబ్ స్టేషన్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, సమ్మెకు దిగిన ఆరుగురిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఇక ఖమ్మం ట్రాన్స్‌కో(పంపిణీ) పరిధిలో మొత్తం 176 మంది ఆర్టిజన్లు పనిచేస్తుండగా, వీరిలో 119 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. మిగతా 57 మంది విధులకు హాజరయ్యారు. కాగా, మంగళవారం ఉదయం ఖమ్మంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆర్టిజన్లు పలువురు ఆందోళన చేపట్టగా పోలీసులు వెనక్కి పంపించారు. హెచ్–82 యూనియన్‌కు చెందిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కె.సురేందర్‌రెడ్డి, కె.రామకృష్ణ, ప్రతినిధులు కృష్ణారెడ్డి, పురుషోత్తం తదితరులు ఖమ్మంలో సమ్మెకు నాయకత్వం వహించారు. విద్యుత్ సంస్థల్లో సమ్మెలు నిషేధించినందున ఎవరైనా విధులకు హాజరు కాకపోతే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామని అధికారులు ముందుగానే హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం విధులకు హాజరు కాని పలువురు ఆర్టిజన్లపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

స్వచ్ఛ పాఠశాలలకు నేడు పురస్కారాలు

ఖమ్మం సహకారనగర్: స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణతో జిల్లాలో ఎంపికైన 37 స్వచ్ఛ పాఠశాలలకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ బుధవారం అవార్డులు అందజేయనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమానికి పాఠశాలల హెచ్‌ఎంలు హాజరుకావాలని డీఈఓ సోమశేఖర శర్మ సూచించారు.

షర్మిల అరెస్టు గర్హనీయం



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌బాబు

ఖమ్మం మామిళ్లగూడెం: వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను అరెస్టు చేయటం గర్హనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు అన్నారు. షర్మిల అరెస్టుకు నిరసనగా ఎస్‌ఆర్‌అండ్ బీజీ ఎన్‌ఆర్ కళాశాల ఎదుట మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ నిరుద్యోగుల విషయంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళనకు చేయాలని షర్మిల సిద్ధం కాగా.. పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలస్యం రవి, నాయకులు రాంబాబునాయక్, బానోతు వీరునాయక్,, మద్దెల ప్రసాదరావు, పాసంగుల పాటి రాఘవ, సామినేని రవి, వాకా వీరారెడ్డి, ధరేంద్ర, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పార్కింగ్‌పై అవగాహన కల్పించేలా 'పార్క్'

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో పెరిగిన వాహనాల రద్దీతో వాహనదారులు ఎక్కడ స్థలం కనిపడితే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మిగతా మిగతా వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యాన పార్కింగ్‌పై వాహనాదారులకు అవగాహన కల్పించాలని మున్సిపల్, పోలీస్ శాఖలు నిర్ణయించాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కింగ్ పార్క్ ఏర్పాటుచేయనుండగా.. ఇక్కడ పార్కింగ్‌పై అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం సుమారు రూ.30 లక్షలు వెచ్చించాలని నిర్ణయించి కేఎంసీ అధికారులు టెండర్లు పిలిచారు. తొలుత సీపీ కార్యాలయంలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తారని, ఆతర్వాత కేఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం

దూషించారని ఏపీఎం ఫిర్యాదు

ముదిగొండ: మండలానికి చెందిన నాయకులతో పాటు రైతులు తనను దూషించారని ఐకేపీ ఏపీఎం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గోకినేపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద అకాల వర్షాలతో తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, నాయకులు ధర్నా చేశారు. అదే సమయాన ఏపీఎం వెంకటేశ్వర్లు రాగా.. ఆయనను దూషించినట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ నాయకుడు రమేష్ తదితరులపై ఏపీఎం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ నరేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు ఇచ్చారని తెలిసిందని, తాను బయట ఉన్నానని చెప్పారు.

మద్యం మత్తులో వీరంగం



శ్రీకాంత్‌కు దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

బోనకల్: మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టిస్తూ వ్యక్తిని గాయపరిచాడు. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా చిట్యాలకు చెందిన లారీ డ్రైవర్ కొదమ శ్రీకాంత్ మంగళవారం బోనకల్‌కు రాగా.. సినిమాహాల్ సెంటర్ వద్ద టీ తాగాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్ ఆ తర్వాత షాపు యజమాని మరీదు శివకృష్ణపై కర్రతో దాడి చేయగా తలకు బలమైన గాయమైంది. అనంతరం షాపులో ఉన్న సీసాలను జనాలపై విసిరేస్తూ గంటపాటు వీరంగం సృష్టించాడు. దీంతో స్థానికులు ఆయనకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,725	1,725
పెసలు	7,000	3,000
కందులు	7,500	7,500
మిర్చి	22,800	18,000
మిర్చి తాలు	12,500	9,000
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

భయం భయంగానే అన్నదాత



నేలకొండపల్లి : నాచేపల్లిలో ధాన్యంలోకి చేరిన నీరు తొలగిస్తున్న రైతులు

ఇంకా వీడని వాన ప్రభావం

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడోరోజు కూడా వర్షం
- పంటలను కాపాడుకునేందుకు జాగారం

నేలకొండపల్లి: అకాల వర్షం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా.. మంగళవారం కూడా వర్షపాతం నమోదైంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. మరోపక్క మళ్లీ వర్షం కురిస్తే తడవొద్దనే భావనతో పట్టాలు కప్పి రాత్రింబవళ్లు కాపాడుకుంటున్నారు. నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి, ముజ్జుగూడెం, ఆచార్లగూడెంలో తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెడుతూ కనిపించారు.

ధాన్యం రాశులపై నీరు

వైరారూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షంతో ధాన్యం, మొక్కజొన్నలు తడిచిపోయాయి. రైతులు ధాన్యం, మొక్కజొన్న రాశులపై పట్టాలు కప్పేందుకు సమయం కూడా చిక్కలేదు. మంగళవారం ఎండ భారీగా ఉండగా.. సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వరి ధాన్యం, మొక్కజొన్నలు తడిశాయి.

మధిరలో భారీ వర్షం

మధిర: మధిర మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. ఉరుములు మెరుపులతో రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. స్థానిక రైల్వే గేట్ వద్ద చెట్టు కూలిపోయింది. ఎడతెరిపిలేని వర్షంతో రహదారులపై నీరు నిలవడంతో పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి.

ఇల్లు నేలమట్టం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో భారీ వృక్షం ఇంటిపై పడగా నేలమట్టమైంది. గ్రామానికి చెందిన పొట్టపల్లి చిన్న జమలయ్య ఇంటిపై గండమాల రమేష్ ఇంటిముందు ఉన్న భారీ వేప వృక్షం విరిగిపడగా ఇల్లు, ప్రహరీ ధ్వంసమయ్యాయి. ఆ సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు.



నేలకొండపల్లి : ధాన్యం ఆరబెడుతున్న రైతులు



వైరారూరల్: ధాన్యం పట్టాలపై నిలిచిన వర్షపునీరు



మధిర : క్లబ్ సెంటర్‌లో రహదారిపై నిలిచిన నీరు



మధిర : వైరా రోడ్డులో నిలిచిన నీరు



బోనకల్ : గోవిందాపురం(ఏ)లో ఇంటిపై పడిన చెట్టు

గమ్యం చేరని జీవితాలు

- కూలి కోసం వెళ్తూ కానరాని లోకాలకు
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి
- డ్రైవర్‌తో సహా మరో 11 మంది కూలీలకు తీవ్ర గాయాలు

ఏన్కూరు/కల్లూరు రూరల్: రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు వారివి. కూలీ పని చేసి సాయంత్రానికి ఎంతో కొంత సంపాదించుకుని బయలుదేరిన వారు గమ్యానికి చేరలేదు. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలిగొనగా.. మరో కూలీ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటనలో డ్రైవర్ సహా 11 మంది మహిళలకు తీవ్ర గాయాలలయ్యాయి. ఏన్కూరులోని హెచ్‌పీ బంక్ ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

ఎండ కాకముందే చేరుకోవాలి...

కల్లూరు పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీ చెందిన 14 మంది మహిళా కూలీలు ఉదయం 5గంటలకే ఆటోలో ఏన్కూరు మండలం రేపల్లెవాడకు మిర్చి కోతకు బయలుదేరారు. ఎండ పెరగముందే చేరుకుని మిర్చి కోతలు మొదలుపెట్టాలనేది వారి భావన. కానీ మార్గమధ్యలో ఏన్కూరు హెచ్‌పీ బంక్ ఎదురుగా కొత్తగూడెం నుండి హైదరాబాద్ వెళ్తున్న కారు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వేము వరమ్మ(40), బీరవల్లి వెంకటమ్మ(45), మేకల సువార్త, డ్రైవర్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు వీరిని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స చేస్తుండగా వరమ్మ, వెంకటమ్మ మృతి చెందారు. ఇక మేకల సువార్త పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నాగరాజు ఖమ్మంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళా కూలీలు కోట శారద, మేక కుమారి, ఉబ్బన సుభద్ర, మేకల శాంతమ్మ, వి.సంధ్య, ఉబ్బన వరమ్మ, దామల మంజరి, కాచిమళ్ల కరుణామ్మ, మేకల వెంకటమ్మ, ఉబ్బన రాణి, ఉబ్బన సుజాతకు ఏన్కూరులో చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమాచారంతో పెనుబల్లి సీఐ హనూక్ చేరుకుని పరిస్థితులు పర్యవేక్షించారు. ఘటనపై వరమ్మ బంధువు వేము మహేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ ఆనందరావు వెల్లడించారు.

కుటుంబ బాధ్యత ఆమెపైనే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీరవెల్లి వెంకటమ్మ భర్త రామకోటి చాలాకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకున్నా కష్టనష్టాలు ఓర్చుకుని ఒక కుమార్తె వివాహం చేసి అత్తగారింటికి పంపాడు. భర్త అనారోగ్యంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో వెంకటమ్మే కూలీ పనులకు వెళ్లేది. ఇప్పుడు ఆమె చనిపోవటంతో కుటుంబానికి దిక్కు లేకుండా పోయినట్లయింది. మరో మృతురాలు వరమ్మకు భర్త లాజరు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త కొత్తగూడెంలో హోంగార్డుగా ఉద్యోగం చేస్తున్నారు. ఏన్కూరు వద్ద ప్రమాదంలో వరమ్మ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. కాగా, వరమ్మ, వెంకటమ్మ మృతదేహాలకు ఖమ్మం ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అంబేద్కర్‌నగర్‌కు తీసుకురాగా, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామం నుంచి ఉదయం పనికోసం బయలుదేరిన ఇద్దరు మృతి చెందడం.. మిగతా వారు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో గ్రామం విషాదం నెలకొంది.



కారు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన ఆటో



వెంకటమ్మ (ఫైల్)



వేము వరమ్మ (ఫైల్)



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యుడు

అంతా నిరుపేదలే...

అంతా నిరుపేదలే కావడంతో రోజు పనికి వెళ్తేనే ఐదు వేళ్ల నోట్లోకి వెళ్తాయి. కల్లూరు పరిధిలోని అంబేద్కర్‌నగర్ నుంచి పలువురు మిర్చి కోతకు రోజూ వెళ్లివస్తారు. స్వగ్రామంలో పనిలేక 30కిలోమీటర్ల దూరమైనప్పటికీ ఎండ కారణంగా ఉదయమే భోజనం పట్టుకుని మరీ వారంతా ఏన్కూరు రేపల్లెవాడ బయలుదేరుతారు. ఎండ పెరగకముందే ఆరు గంటకల్లా చేరుకుంటే పని మొదలుపెట్టొచ్చని భావించారు. కానీ ఏన్కూరు వద్ద జరిగిన ప్రమాదంలో వరమ్మ, వెంకటమ్మ మృతి చెందడం, ఆటోడ్రైవర్ సహా మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి.

కేసీఆర్ నాయకత్వంలో ముందుకు..

మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఆయన నాయకత్వంలో అందరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి అన్నారు. బీఆర్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైరా శాంతినగర్‌లో ఆమె జెండా ఎగురవేశారు. ఆతర్వాత పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి వందలాది మంది గిరిజన మహిళలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈక్రమంలో చంద్రావతి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకుంటానని తెలిపారు. నాయకులు వాసిరెడ్డి రవికుమార్, బానోత్ నీల, బానోత్ చిన్నా, దావరియా, అమర్లపూడి లాజర్, కొత్తా వెంకటేశ్వర్లు, అమర్లపూడి మేరమ్మ, పోట్ల గోపాలరావు, అనిల్, సాంబశివరావు, వీరయ్య, మల్లేశ్వరరావు, గురవయ్య, మందడపు శంకర్, బాణాల కాంతాచారి, హనుమాయమ్మ, పుల్లారావు, రాజు, కల్యాణ్ పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న చంద్రావతి

పిడుగుపాటుతో పాడిగేదె మృతి

బోనకల్: మండలంలోని రాపల్లిలో మంగళవారం పిడుగుపడి పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బోలెం రాము పొలంలో గేదెను మేపుతుండగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి పిడుగు పడగా మృతి చెందింది. దీంతో సుమారు రూ.80 వేలు నష్టపోయినందున తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

నిరుద్యోగ నిరసన ర్యాలీ విజయవంతం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో సోమవారం జరిగిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేశారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ర్యాలీని విజయవంతం చేసిన వారికి ఆయనతో పాటు నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావీద్, ముస్తఫా తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాల్గొన్న ర్యాలీలో సుమారు 30వేల మంది హాజరై ప్రభుత్వానికి నిరసన తెలిపారని పేర్కొన్నారు. కాగా, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు బొందయ్య, ముజాహిద్ హుస్సేన్, మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన చంద్రం, ఏలూరి రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

పంట నష్టం రీ సర్వేను అడ్డుకున్న రైతులు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడులో ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట సర్వే నివేదికలో అవకతవకలు జరిగాయని రైతులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వైరా ఏడీఏ బాబురావును రీ సర్వే కోసం మంగళవారం గ్రామానికి రాగా రైతులు అడ్డుకున్నారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా సర్వేకు రావడం ఏమిటని ప్రశ్నించారు. తొలుత జాబితాలోని రైతుల వివరాలు వెల్లడించాకే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ఉన్నతాధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం సర్వే చేయనున్నట్లు ఏడీఏ చెప్పగా, ఆ వివరాలు వెల్లడించాలని కోరారు. దీనికి ఏడీఏ నిరాకరించడంతో రైతులు అడ్డుకోగా వెనక్కి వెళ్లిపోయారు. రైతులు మల్లాది లింగయ్య, మందా రాజ్యం, మరీదు నాగభూషణం, మందా కృష్ణ, నాగేశ్వరరావు, కందుల పాపారావు, పారా వెంకటమోహన్, బుంగా రాములు, తోటకూర వెంకటేశ్వర్లు, జంపాల రవి, మరీదు ప్రసాద్ పాల్గొన్నారు.



వైరా ఏడీఏ బాబురావును నిలదీస్తున్న రైతులు

స్వాజ్ బదిలీలు వెంటనే చేపట్టండి..



పిల్లలతో కలిసి నిరసన తెలుపుతున్న స్వాజ్ టీచర్లు

కలెక్టరేట్ ఎదుట పిల్లలతో కలిసి నిరసన

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ దంపతు(స్వాజ్)లు బదిలీల కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నందున వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని స్వాజ్ ఫోరం బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. వీరికి పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలపగా.. స్వాజ్ ఉపాధ్యాయులు వారి పిల్లలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.విజయ్, చంద్రకంటి శశిధర్, చిలుకా వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ జీఓ 317 అమలులో భాగంగా ఉపాధ్యాయ దంపతులను ఒకే జిల్లాకు కేటాయించాల్సి ఉన్నా అలా చేయలేదని ఆరోపించారు. సుమారు 16 నెలలుగా ఇబ్బంది పడుతున్నందున తక్షణమే బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, డీఈఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో బి.అప్రము, ఎం.కోటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో 200 అడుగుల ఫ్లెక్సీ!

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో మంగళవారం పార్టీ ప్రతినిధుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన 200 అడుగులు ఫ్లెక్సీని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీఎం కేసీఆర్ ఏమేం ఇవ్వాలో అవి ఇచ్చారని.. ఇక ఆయన రుణం తీర్చుకోవడడమే మిగిలిందని అన్నారు.



సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన 200 అడుగుల ఫ్లెక్సీ

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వెలుగుమట్ల కొత్తకాలనీలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా ఓ ఇల్లు దగ్ధమైంది. కాలనీకి చెందిన మల్లోజు సురేష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిజ్, టీవీ, కూలర్, బట్టలు, ఫర్నిచర్‌తో పాటు వంట సామాగ్రి అన్నీ కాలిపోయాయి. కార్పొరేటర్ లకావత్ సదులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పడంతో పక్క ఇళ్లకు ప్రమాదం తప్పినట్లయింది. అయి తే, అప్పటికే సురేష్ ఇంట్లో స్లాబ్ నిర్మాణానికి తీసుకొచ్చిన రూ.1.30లక్షల నగదు, కొంత మే ర బంగారం కాలిపోయిందని బాధిత కుటుంబం వెల్లడించింది.



ఇంట్లో కాలిబూడిదైన సామగ్రి

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో జరిగిన వేర్వేరు దొంగతనాల్లో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సొత్తు స్వాధీనం చేసుకోగా వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మిర్యాల విజయ ఇంట్లో గతనెల 21వ తేదీన తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు వస్తువులు దుండగులు అపహరించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఈడ మహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా... చెడు వ్యసనాలకు బానిసై చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో ఆయన నుంచి బంగారు గొలుసు, ఒక జత బంగారు సూత్రాలు, జూకాలు, రెండు జతల వెండి పట్టీలు, వెండి మొల తాడు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రాములు తెలిపారు. అదేవిధంగా స్థానిక వెంగళరావు నగర్ కాలనీకి చెందిన గోపోసు భాస్కర్ ఇంటి తాళాలను ఈనెల 9వ తేదీన పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. కేసు విచారణలో భాగంగా వెంగళరావు నగర్ కాలనీలో ఏకాంగి సత్యశ్రీని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించింది. దీంతో ఆమె నుంచి రెండు బంగారు గొలుసులు, చైన్లు, జత బంగారు చెవి దిద్దులు తదితర ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సీఐ కరుణాకర్, సిబ్బంది ఎం.శ్రీనివాస్, ఎస్.లక్ష్మణరావును కల్లూరు ఏసీపీ రామానుజం అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో సీఐ కరుణాకర్, సిబ్బంది

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు సునీత, రాజశేఖర్‌రెడ్డి

మూడు గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న సునీత, రాజశేఖర్‌రెడ్డిలను రాత్రి ఏడుగంటల వరకు సీబీఐ అధికారుల బృందం పలు అంశాలపై ప్రశ్నించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఓసారి రాజశేఖర్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరుకాగా, మంగళవారం మరోమారు హాజరయ్యారు. సునీత తొలిసారిగా కోఠిలోని సీబీఐ కార్యాలయానికి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత కుటుంబ పరిస్థితులు, ఇతర అంశాలపై వారి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–1) గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత.. తదుపరి విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేశారు.

ఆత్మ గౌరవంతో 'లక్ష'ణంగా..

- జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్ల పంపిణీ


సాక్షి, అమరావతి: పట్టణ పేదలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతగా ఇప్పటికే 48,416 టిడ్కో ఇళ్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో దఫాలో మరో 40 వేలకు పైగా యూనిట్లను పట్టణ పేదలకు అందచేసేందుకు సిద్ధమైంది. జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించారు. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో భారంగా గడిపిన బడుగు జీవులు అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో గృహాలకు యజమానులుగా మారుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కావలి నుంచి మొదలయ్యే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ జూన్ చివరి వరకు కొనసాగనుంది. కావలి మున్సిపాలిటీలో అన్ని వసతులతో పూర్తి చేసిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 29వతేదీన శ్రీకాకుళంలో 1,280 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

జూమ్‌లో.. కామ్‌గా

ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి 'మేనేజ్‌మెంట్'

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చెరుకూరి రామోజీరావు (ఏ–1) కీలక ఆధారాలను మాయం చేసేందుకు విఫలయత్నం చేసినట్లు బహిర్గతమైంది. మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను గుట్టు చప్పుడు కాకుండా ధ్వంసం చేసినట్లు తాజాగా సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారని, అందుకోసం ఫోర్‌మెన్‌లతో ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తేలింది. ఏ ఒక్కటీ ఆధారం దొరకకుండా రికార్డులు డిలీట్ చేయాలని మార్గదర్శి చిట్స్ బ్రాంచీల సిబ్బందిని ఆదేశించిన యాజమాన్యం జూమ్ మీటింగ్‌లో అర్ధరాత్రి దాకా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించినట్లు తేలింది. మరోవైపు గత డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ లావాదేవీలు దాదాపు స్తంభించిపోవడంతో గొలుసుకట్టు తరహా మోసాలకు అలవాటుపడిన మార్గదర్శి యాజమాన్యం కొత్త చిట్టీలు లేకపోవడంతో దిక్కులు చూస్తోంది. పాడుకున్న చిట్టీల మొత్తం కోసం చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళన ఖాతాదారుల్లో నెలకొంది.



■ అడ్డదారిలో.. గుట్టుగా

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో తిమ్మిని బమ్మిని చేసేందుకు రామోజీరావు బరి తెగించారు. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు తేలడంతో కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు పట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను ధ్వంసం చేయించారు. దర్యాప్తులో ఉన్న కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేసినట్లు 2006లో బయటపడింది. నాడు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు నమోదు చేసింది. దీంతో డిపాజిట్లు వసూలు చేయడం తమ తప్పిదమేనని రామోజీరావు అంగీకరించారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆయన హఠాత్తుగా మూసివేశారు. ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో కూడా అదే తరహాలో రికార్డులను నాశనం చేసే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ముగించారు.

■ అర్ధరాత్రి విధ్వంసం.. జూమ్‌లో పర్యవేక్షణ

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలను సీఐడీ అధికారులు విస్తృతం చేయడంతో బెంబేలెత్తిన రామోజీరావు తనకు అలవాటైన రీతిలో ఆధారాలను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకోసం బ్రాంచి కార్యాలయాల మేనేజర్లతో (ఫోర్‌మెన్) మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో వారికి క్షుణ్ణంగా వివరించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ప్రధాన కార్యాలయానికి మళ్లించిన చందాదారుల నగదు వివరాలు, భారీగా నిధుల తరలింపు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల వసూలు, పాట పాడిన చందాదారులకు చిట్టీ మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తాన్ని అక్రమ డిపాజిట్‌గా అట్టిపెట్టడం, యాజమాన్య వాటా కింద అట్టిపెట్టిన చిట్టీల టికెట్లు, వాటిపై చందా చెల్లించకుండానే చెల్లించినట్టుగా మాయ చేయడం.. వీటన్నింటికి సంబంధించిన రికార్డులు, పత్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ ఎలా ధ్వంసం చేయాలో మార్గదర్శి ప్రధాన కార్యాలయ అధికారులు బ్రాంచి మేనేజర్లకు వివరించారు. ఆధారాల ధ్వంసం ప్రక్రియను ప్రధాన కార్యాలయం నుంచే అర్ధరాత్రి వరకూ పర్యవేక్షించారు. సీఐడీ అధికారులు తాజాగా నిర్వహించిన సోదాల్లో ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో తీవ్రంగా పరిగణిస్తున్నారు. ధ్వంసం చేసిన ఆధారాలు, ఆన్‌లైన్ రికార్డులను సీఐడీ విభాగం రిట్రీవ్ చేసింది.

డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు లేవు

మార్గదర్శి అక్రమ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో కొత్త చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాలు 2022 డిసెంబర్ నుంచి దాదాపుగా స్తంభించిపోయాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేస్తుండగా రామోజీరావు ఆ చట్టాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో కొత్త చిట్టీలు ఆగిపోయాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సోదాల్లో బయటపడిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మార్గదర్శి 37 బ్రాంచి కార్యాలయాల్లో రూ.273 కోట్ల వేలం టర్నోవర్‌తో 2,357 చిట్టీలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా రూ.6.29 కోట్లు వేలం టర్నోవర్ విలువ ఉన్న 148 కొత్త చిట్టీలను ప్రారంభిస్తారు. వాటిపై మార్గదర్శి యాజమాన్యానికి కమీషన్ రూపంలోనే రూ.31.45 లక్షల వస్తాయి. డిసెంబర్ నుంచి చందాదారులు ముందుకు రాకపోవడంతో ఏకంగా 1,200కుపైగా కొత్త చిట్టీలు ప్రారంభం కాలేదు. రూ.51 కోట్ల వేలం టర్నోవర్ ఉన్న చిట్టీలు నిలిచిపోయాయి. ఆ మొత్తాన్ని మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లతోపాటు తమ సొంత సంస్థల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక కమీషన్ రూపంలో రూ.2.55 కోట్ల మేర మార్గదర్శి యాజమాన్యానికి రాకుండా పోయింది. కొత్త చిట్టీల కోసం చందాదారులను రప్పించేందుకు బ్రాంచి మేనేజర్ల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

చందాదారుల ప్రదక్షిణలు... డిపాజిట్‌దారుల్లో ఆందోళన

గతేడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు ప్రారంభం కాకపోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మనీ సర్క్యులేషన్ నిలిచిపోయింది. పాత చిట్టీల చందాదారులు చెల్లించిన మొత్తాన్ని రామోజీరావు అక్రమంగా తమ సొంత సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేశారు. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. కొత్త చిట్టీలు ప్రారంభమైతే ఆ చందాదారులు చెల్లించే మొత్తాన్ని పాత చిట్టీలు పాడిన వారికి చెల్లిస్తుంటారు. గడువు తీరిన అక్రమ డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొత్తంగా చెల్లించడం, వడ్డీలు చెల్లించడం మొదలైన వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రతి చిట్టీలోనూ యాజమాన్యం వాటా కింద అట్టిపెట్టుకున్న టికెట్ల చందా మొత్తాన్ని కూడా అవే నిధుల్లో చెల్లించినట్టు రికార్డుల్లో మాయ చేసేవారు. ఈ గొలుసు కట్టు తరహా మోసాన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. ఇప్పుడు కొత్త చిట్టీలు లేనందున మార్గదర్శి లావాదేవీలు నిలిచిపోయాయి. పాత చిట్టీలు పాడిన చందాదారులకు సకాలంలో చెల్లించడం లేదు. తాము ష్యూరిటీ సంతకాలన్నీ చేయించినా చిట్టీ మొత్తం చెల్లించకపోవడంతో చందాదారులు ఆందోళన చెందుతున్నారు. మార్గదర్శి కార్యాలయాల చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు. విజయవాడలోని లబ్బీపేట, విశాఖపట్నంలోని సీతంపేట, గుంటూరు అరండల్‌పేట బ్రాంచి కార్యాలయాలకు వచ్చి రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్నారు. దీనిపై కొందరు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం. మరోవైపు గతంలో చిట్టీలు పాడిన మొత్తాన్ని వారికి చెల్లించకుండా రశీదు ఇచ్చి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడటంతో ఆ డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, వడ్డీ లేకపోయినా అసలైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. బ్రాంచి కార్యాలయాల నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిలో ఆందోళన తీవ్రమవుతోంది. కొందరు సీఐడీ అధికారులను కూడా సంప్రదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోసి నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే జాప్యానికి ఆస్కారమే ఉండదని, నిధుల మళ్లింపు జరగకుంటే చిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమయ్యేవి కావని అధికారులు పేర్కొంటున్నారు.

'ర్యాపిడో' బైకర్ వికృత చేష్టలు

- భయపడి బైక్ నుంచి దూకిన యువతి
- గాయాలు అవ్వడంతో ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బనశంకరి: ర్యాపిడో బైకర్ లైంగిక వేధింపుల నుంచి తప్పించుకోవడానికి బైకు నుంచి కిందకు దూకిన యువతి గాయపడిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... బాధితురాలు (30) ప్రైవేటు ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి 11.30 గంటల సమయంలో ఇందిరానగర్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్‌ను యాప్‌లో బుక్ చేసింది. యువతిని పికప్ చేసుకున్న బైకర్ ఆమె మొబైల్‌ను లాక్కుని, కౌగిలించుకుని వెకిలిచేష్టలు చేశాడు. వెళ్లాల్సిన చోటుకు కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తుండగా యువతి అతడిని ప్రశ్నించింది. సమాధానం ఇవ్వకుండా మరింత వేగంగా బైక్‌ను పోనిచ్చాడు. పైగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. భయాందోళనకు గురైన ఆమె బీఎంఎస్ ఇన్‌స్టిట్యూట్ వద్ద బైకు నుంచి దూకడంతో గాయపడింది. ఒక స్నేహితురాలికి, అలాగే పోలీసులకు కాల్ చేసి సాయం అడిగింది. అయితే పోలీసులు ఇది ప్రేమికుల గొడవ అనుకుని స్పందించలేదని బాధితురాలు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చివరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో బైకర్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై కిడ్నాప్, వేధింపులు, లైంగికదాడికి యత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

శ్రీవారి ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ల చక్కర్లు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో మంగళవారం మూడు హెలికాప్టర్లు చక్కర్లు కొట్టాయి. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, పరకామణి భవనం, బాలాజీనగర్ ఉపరితలంపై వెళ్లాయి. తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లకూడదనేది ఆగమశాస్త్ర నిబంధన. అందుకే రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖులు, వివిధ దేశాల అధ్యక్షులు వచ్చే తిరుమలలో హెలిప్యాడ్ నిర్మించాలన్న ప్రతిపాదనల్ని కూడా పక్కనపెట్టి ఆగమశాస్త్రానికే టీటీడీ పెద్దపీట వేసింది. ఆగమ పరంగానే కాకుండా భద్రత పరంగానూ తిరుమలను నో ఫ్లైజోన్‌గా ప్రకటించాలని టీటీడీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తిరుమలలో హెలికాప్టర్ల ప్రయాణంపై విజిలెన్స్ అధికారులు రేణిగుంటలోని విమానాశ్రయం ఏటీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లా వార్తలు

ఉత్పత్తిలో అగ్రభాగాన మెయిన్ వర్క్‌షాప్




సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని మెయిన్ వర్క్‌షాప్‌లో గతేడాది(2021–22)తో పోలిస్తే 2022–23 ఆర్థిక సంవత్సరంలో అధిక ఉత్పత్తి జరిగింది. ఈమేరకు ఎనిమిది వేలకు పైగా బెల్ట్ కన్వేయర్స్ రోల్స్ ఉత్పత్తి చేసినట్టు వర్క్‌షాపు జీఎం గణపతిరావు తెలిపారు. వర్క్‌షాప్‌లో డీజీఎం రాజీవ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం రూ.10.46 కోట్ల లాభం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వర్క్‌షాపు ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ముదిగొండ, ఖమ్మం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, కల్లూరు మండలాల్లోని పలుగ్రామాల్లో జరి గే కార్యక్రమాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి తెలిపారు.

29న 'నవోదయ' ప్రవేశపరీక్ష



కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 29వ తేదీన పరీక్ష జరగనుంది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుండగా, 10.30గంటలకల్లా విద్యార్థులు ఆధార్ కార్డు లేదా నివాస ధృవీకరణ పత్రం, పరీక్షప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ చంద్రబాబు సూచించారు. కేంద్రంలోకి చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలు అనుమతించబోమని చెప్పారు. కాగా, హాల్‌టికెట్లను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, సందేహాలు ఎదురైతే 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా, ప్రవేశపరీక్ష కోసం 4,308 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉమ్మడి జిల్లాలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆకాంక్షలను అపహాస్యం చేసేలా..

- తూతూ మంత్రంగా జాబ్‌మేళాలు, ఉపాధి
- ఫలితంగా శ్రమదోపిడీకి గురవుతున్న యువత
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇక్కట్లు



ఇల్లెందులోని యూత్ ట్రైనింగ్ సెంటర్

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావడం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏలను ఏర్పాటుచేసింది. వీటిని ద్వారా ఏజెన్సీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే కాక విద్యా, ఉపాధి మార్గాల్లో అవకాశం కల్పించాలి. ఇక యువతకు నచ్చిన రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పించేందుకు ఐటీడీఏలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి జాబ్‌మేళాల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఉపాధి మార్గం వారి శ్రమ, జీవితంలో స్థిరపడాలన్న ఆకాంక్షను అపహాస్యం చేసేలా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేతనాలు అందక నెల, రెండు నెలల వ్యవధిలోనే ఇంటి బాట పడుతున్నారు. మళ్లీ వారికి కూలీ పనులే దిక్కవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం

ఇల్లెందులో ఏర్పాటైన యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ) ద్వారా 45 రోజుల అనంతరం జాబ్‌మేళాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఐటీడీఏ అధికారులపై ఉంటుంది. యువత ఉద్యోగంలో చేరాక కూడా తరచుగా అయా సంస్థను సందర్శించి ఉపాధి అవకాశాలను పరిశీలించాలి. ప్రస్తుతం అలా జరగకపోగా.. కూలీల తరహాలో యువతను పంపిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో కంపెనీ బాధ్యులు రెండు, మూడు నెలలకే ఇంటికి పంపిస్తున్నారు.

శిక్షణను విస్మరించి పనులు

ఇల్లెందు వైటీసీలో సోలార్ ఎరక్షన్‌పై యువతకు శిక్షణ ఇచ్చారు. అంటే సోలార్ ఎక్విప్‌మెంట్ బిగించే విధానాన్ని నేర్పించినట్లు చెబుతూ ఉపాధి కల్పించారు. బొబ్బిలి, హైదరాబాద్‌ల్లో యువతకు ఉపాధి కల్పించగా.. అక్కడ వారితో గుంతలు తవ్వించడం, సామగ్రి మోయించడం వంటి పనులు మాత్రమే చేయించారు. దీంతో నివ్వెర పోవడం యువత వంతైంది.

వేతనాలు అధికారుల ఖాతాల్లోకి..

ప్రభుత్వం తరఫున నిర్వహించిన శిబిరాల్లో శిక్షణ తీసుకున్నాక ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్న యువతకు వేతనాలు ఆయా సంస్థలు నేరుగా చెల్లించాలి. ఇందుకోసం అకౌంట్ల వివరాలు సేకరించి జమ చేయడం లేదంటే నేరుగా చెల్లించడమే చేయాలి. కానీ ఐటీడీఏలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా ఉపాధి పొందిన వారి వేతనాలను అధికారుల అకౌంట్లలో జమ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, వైటీసీలో శిక్షణ పొందిన పలువురు యువతలకు హైదరాబాద్‌లో ఉపాధి చూపించగా.. నెలకే సంస్థ నిర్వాహకులు తిప్పి పంపించారు. పని చేసిన కాలానికి కూడా వేతనం రాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక యువతులు ఆవేదన చెందుతున్నారు.

వేతనం తగ్గించారు



పదో తరగతి అర్హతతో ఐటీడీఏలో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపిస్తానంటే చేరాను. శిక్షణ పూర్తయ్యాక బొబ్బిలో రెండు నెలల పాటు పనిచేశా. ఆతర్వాత ఇంటికి పంపించేశారు. నెలకు రూ.12,300 వేతనం ఇస్తామన్న వారు ఇపుడు రూ.11వేలు ఇస్తామంటున్నారు. అందులోనూ రూ.8వేలే అందాయి.
–పూనెం సందీప్, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

అధికారుల అకౌంట్‌లో వేశామన్నారు



ఇల్లెందు వైటీసీలో సోలార్ ఎరక్షన్ అంశంపై శిక్షణ తీసుకున్నా. మాకు బొబ్బిలిలో ఉపాధి కల్పించగా రెండు నెలల తర్వాత ఇంటికి పంపారు. విధుల్లో ఉన్న సమయంలో రూ.5వేలు వాడుతున్నాను. మిగతా వేతనం అధికారుల ఖాతాల్లో జమ చేశామంటున్నా ఇక్కడ అడిగితే సమాధానం చెప్పడం లేదు.
–పాయం రవీందర్, కరకగూడెం, మణుగూరు మండలం

కాలానుగుణంగా ఉద్యోగుల్లో మార్పు రావాలి

మణుగూరుటౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు మారుతు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత సూచించారు. మణుగూరు డిపోలో మంగళవారం ఉద్యోగులకు ఏర్పాటుచేసిన 'టాక్ట్' శిక్షణలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీలోని ప్రతీ ఉద్యోగి ప్రయాణికులకు సేవలందిస్తూనే సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కాలానుగుణంగా మార్పు చెందని సంస్థలు కాలగర్భంలో కలిసిపోయాయని పేర్కొన్నారు. ఈనేపథ్యాన ఉద్యోగుల్లో మార్పు వస్తే ఆర్టీసీ వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మణుగూరు బ్రాంచి మేనేజర్ మన్మధరావు, డిపో మేనేజర్ టి.స్వామి పలు అంశాలపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, ఉద్యోగులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రభులత

రేపు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ)ఆధ్వర్యాన ఈనెల 27న 'నిధి కే ఆప్ నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎండీ.సలీంఖాన్ తెలిపారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో సందేహాలు ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు పాత మున్సిపాలిటీ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు పాల్వంచలోని పాత మున్సిపాలిటీల్లోని తమ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

పేదలకు అండగా ఎర్రజెండా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: పేదలకు అండగా నిలవడమే కాక వారి సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పోరాడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడులో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, సాగునీరు, తాగునీరు, పంటల గిట్టుబాటు ధరల కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని తెలిపారు. అప్పటి శ్రీరాంసాగర్, ఇప్పటి సీతారామ ప్రాజెక్టుల కోసం పాదయాత్ర చేసినట్లు గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు లౌకిక పార్టీలతో జతకడతామని ఆయన తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించిన ఆయన వరి ఎకరాకు రూ.30వేలు, మామిడికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, నండ్ర ప్రసాద్, ఏ.రామయ్య, వి.సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, రత్నం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తమ సర్వీసు క్రమబద్ధీకరించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యాన పలువురు తమ్మినేనిని కలిసి విన్నవించారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని చెన్నారం, కోరట్లగూడెం, బోదులబండల్లో కూడా పర్యటించిన తమ్మినేని వీరభద్రం పార్టీ సమావేశాల్లో మాట్లాడారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బండి రమేష్, పిట్టల రవి, కే.వీ.రెడ్డి, రచ్చా నర్సింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, పెద్దిరాజు నర్సయ్య, గుగులోత్ వీరు నాయక్, ఇంటూరి అశోక్, బలుసు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5 నుంచి నిరవధిక సమ్మె..

- ప్రభుత్వానికి రేషన్ డీలర్ల జేఏసీ హెచ్చరిక
- గౌరవ వేతన సాధనకు హనుమకొండలో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న బత్తుల రమేష్‌బాబు



కేయూ జంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న రేషన్ డీలర్లు

హన్మకొండ చౌరస్తా: ఈఏడాది జూన్ 5వ తేదీలోగా గౌరవ వేతనం ప్రకటించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రేషన్ డీలర్ల సమావేశం మంగళవారం హనుమకొండ రెడ్డికాలనీలో నిర్వహించారు. తొలుత సుమారు రెండువేల మంది రేషన్ డీలర్లు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు డప్పు చప్పుళ్లు, కళాకారుల ఆటపాటలతో ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామని తెలిపారు. చాలీచాలనీ కమీషన్లతో బతకలేక వడ్డీకి డబ్బు తీసుకొచ్చి పెట్టుబడిగా పెడుతూ రేషన్ షాపులను నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య భద్రత, పని భద్రత లేక ఎన్నో అవమానాలను భరిస్తున్నామని అన్నారు. తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ నాయకోటి రాజు మాట్లాడుతూ.. ఎంఎల్‌సీ పాయింట్ల నుంచి వచ్చే ప్రతీ బస్తాకు కేజీ నుంచి మూడు కేజీల బియ్యం తక్కువగా ఉండడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమావేశంలో దొమ్మాటి రవీందర్, మల్లికార్జున్‌గౌడ్, హనుమండ్లు, యాదగిరి, కిరణ్, మోహన్‌నాయక్, రవి, రాధాకృష్ణ, చిలగానీ మోహన్, పోతరాజు రమేష్, బత్తుల మహేష్, విజయపాల్, సమ్మయ్య, గౌరీశంకర్, వెంకటేశ్వర్లు, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు..

రేషన్ డీలర్ల సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రభుత్వం డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.30వేలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల కమీషన్ వెంటనే ఇప్పించాలని, డీలర్ చనిపోతే దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వడమే కాక హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఇంకా గోదాం నుంచే 3, 4 కిలోల బియ్యం తక్కువగా వస్తున్నందున తమపై 6/ఏ విజిలెన్స్ కేసులు పెట్టొద్దని, రెండేళ్లకోసారి చేపట్టే ఆథరైజేషన్ రెన్యూవల్‌ను ఐదేళ్లకు పెంచాలని, ఉన్నత విద్యావంతులైన రేషన్ డీలర్లకు శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలని, ఐదేళ్లుగా షాపులు నిర్వహిస్తున్న తాత్కాలిక డీలర్లను రెగ్యులరైజ్ చేయడంతో పాటు హైదరాబాద్‌లో వెయ్యి గజాలు, జిల్లా కేంద్రాల్లో 500 గజాల స్థలంలో రేషన్ భవనం నిర్మించాలని తీర్మానించారు.